# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
# కేంద్ర కమిటీ

పత్రికా ప్రకటన

డిసెంబర్ 29, 2017

## విప్లవ ద్రోహి జినుగు నరసింహా రెడ్డిని సిసి, సిపిఐ (మావోయిస్టు) పార్టీ నుంచి బహిష్కరిస్తున్నది!

డిసెంబర్ 23న మా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జినుగు నరసింహా రెడ్డి అలియాస్ జంపన్న తన భార్య రజిత (జయ)తో సహా శత్రువు ముందు మోకరిల్లి అనారోగ్యాన్ని, పార్టీ ఉన్నత నాయకత్వంతో సైద్ధాంతిక విభేదాలను సాకులుగా చూపాడు. గత రెండు సంవత్సరాలుగా అతని వ్యవహార శైలితో సన్నిహిత సంబంధం కలిగిన మా పార్టీ నాయకత్వానికీ, క్యాడర్లకు ఆయన సరెండర్ పెద్ద ఆశ్చర్యం కలిగించకపోయినప్పటికీ, మా పార్టీ ఉన్నత స్థాయి కమిటీ సభ్యుడిగా ఉంటూ ఈ విధంగా సైద్ధాంతికంగా, రాజకీయంగా బలహీనపడి దిగజారిపోవడం, శత్రువు ముందు సరెండర్ కావడం దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ సభ్యులకు, విప్లవ ప్రజానీకానికీ పలు సందేహాలకు తావిచ్చి ఉంటుంది. అయితే, మా పార్టీ చరిత్ర తెలిసిన వారికెవరికైనా ప్రజాయుద్ధ అభివృద్ధి క్రమంలో ఇలాంటి బలహీనమైన శక్తులు తుదివరకు నిలబడలేక దిగజారిపోవడం పెద్ద ఆశ్చర్యాన్ని కలిగించదు. విప్లవోద్యమములో, పార్టీలో, ఎంతటి గడ్డు పరిస్థితులలోనైనా ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా తమను తాము మలుచుకోలేని అసమర్థులు, వాటికంటే తమ వ్యక్తిగత ప్రయోజనాల్ని మిన్నగా భావించేవారు ఈ విధంగా దిగజారిపోవడం అనివార్యం. నరసింహా రెడ్డి సిసి సభ్యుడు అయినప్పటికీ గత 3-4 సంవత్సరాలుగా ఆయన కనీసం ప్రాథమిక పార్టీ సభ్యుడి చైతన్యాన్ని సైతం ప్రదర్శించలేకపోయాడు. అనారోగ్యం, సైద్ధాంతిక విభేదాలు అనేవి కేవలం తన దిగజారుడును, విప్లవ ద్రోహాన్ని కప్పిపుచ్చుకునేందుకు చెప్పిన సాకులు మాత్రమే. మా కేంద్రకమిటీ నరసింహా రెడ్డి అరాచక ప్రవర్తనను, శత్రువు ముందు తన దిగజారుడును ఖండిస్తున్నది, అతనిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నది.

నరసింహా రెడ్డి సహచరి రజిత (జయ) దశాబ్ద కాలానికి పైగా పార్టీలో కొనసాగుతూ డివిసి స్థాయికి ఎదిగింది. కానీ ఆమె ఆయనలోని బలహీనతల్ని స్పష్టాతిస్పష్టంగా అర్థమవుతున్నప్పటికీ, సహచర కామ్రేడ్స్ ఆయనను విమర్శిస్తున్నప్పటికీ తాను మాత్రం పల్లెత్తు విమర్శ కూడా చేయకుండా ఒక భార్యగానే ఉండిపోయింది. పితృస్వామ్య విలువలనే పాటిస్తూ తుదకు ఆయనతో పాటు శత్రువు ముందు లొంగిపోయింది. ఆమె సభ్యత్వాన్ని పార్టీ రద్దు చేస్తోంది.

2017 ఫిబ్రవరిలో జరిగిన సిసి 5వ సమావేశం నరసింహా రెడ్డిలో మూర్తీభవించిన వ్యక్తివాదం, పెత్తందారీతనం, కుహనా ప్రతిష్టకై పాకులాడడం, శత్రువు అంటే పెరిగిన భయం వంటి కార్మికవర్గేతర ధోరణుల గురించి చర్చించింది. ఆయన తన స్వీయ ఆలోచనలను కమిటీపై రుద్దడానికి అనేక రకాల ప్రయత్నం చేసేవాడు. అందుకు కార్మికవర్గ పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడంతో సహా కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని సహితం దృష్టిలో పెట్టుకోకుండా తనకు తోచిన విధంగా పిడి వాదనలు ముందుకు తేవడం ఆయనకు అలవాటుగా మారింది. తనకు తోచిందల్లా చర్చకు పెడుతూ కమిటీ మీటింగులను ప్రతిష్టంభనకు గురి చేసేవాడు. కమిటీ మెంబర్లు గట్టిగా అడ్డుకుంటే ఆ మీటింగ్‌లను బహిష్కరిస్తానంటూ అలక పూనేవాడు. పార్టీ నిధులను తన చిత్తానుసారం విచ్చలవిడిగా ఖర్చు చేసి కమిటీకి సరిగా లెక్కలు చెప్పేవాడు కాదు. ఆయనలో గల తప్పులకు వ్యతిరేకంగా వివిధ కమిటీలు పోరాడినప్పటికీ ఆయన కుహనా ప్రతిష్టకు గురవుతూ ఏమాత్రం తప్పులను సరిదిద్దుకోలేదు సరికదా, కనీసం స్వీకరించేందుకు ప్రయత్నించలేదు. ఫలితంగా ఆయనలో ఆ తప్పులు మరింత పెరిగాయి. ఆయనలో శత్రువు అంటే క్రమంగా భయం కూడా పెరిగింది. అది ఏ స్థాయికి వెళ్లిందంటే తనతో ఉండే సెక్యూరిటీ గార్డులు, తాను నాయకత్వం వహిస్తున్న ప్రాంతంలోని సాధారణ దళ సభ్యులు కూడా ఆయనను విమర్శిస్తోన్న స్థితి ఏర్పడింది. వాస్తవంగా ఈనాడు విప్లవోద్యమం ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులలో, శత్రువు కొనసాగిస్తోన్న భారీ సైనిక దాడుల మధ్య పార్టీ అత్యున్నత స్థాయి నాయకత్వ కామ్రేడ్స్ ఎంతో నిబ్బరంగా ఉంటూ, సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ పరంగా పార్టీ, పీ.ఎల్.జీ.ఏ. శక్తులకు ధైర్యంగా నాయకత్వం వహించాల్సిన అవసరం ఉంది. దీనిని ఒక సి.సి.ఎం.గా ఆయన అర్థం చేసుకోలేదు. ఫలితంగా పార్టీకి, విప్లవోద్యమానికి చాలా నష్టం కలిగిస్తూ వచ్చాడు. 2016లో నిర్వహించాల్సిన సిసి మీటింగ్‌ను విజయవంతం చేయడానికి సంబంధించి ఆయన తన బాధ్యతను చిత్తశుద్ధితో, దృఢసంకల్పంతో నిర్వహించకపోవడం, అందుకు సాహసించకపోవడమే గాకుండా దానిని నిలిపివేయడానికి తుది వరకు అనేక ఆటంకాలు కల్పించాడు.

విప్లవోద్యమం ముందున్న అనేక సవాళ్లను పరిష్కరించుకునేందుకు 2017లో నిర్వహించిన కేంద్రకమిటీ (సిసి), సెంట్రల్ రీజనల్ బ్యూరో (సిఆర్‌బి) సమావేశాలకు హాజరు కావాల్సిన తాను పెరిగిన శత్రు దాడులను చూసి తీవ్ర భయాందోళనకు గురై గైరుహాజరయ్యాడు. ఆ సమావేశాలకు హాజరైతే తాను తీవ్రమైన విమర్శలకు గురికావాల్సి ఉంటుందనేది ఆయన ఊహించనిదేమీ కాదు. ఇది కూడా ఆయన గైరుహాజరుకు ముఖ్యమైన కారణం. నరసింహా రెడ్డిలో వ్యక్తమవుతోన్న ఈ అన్ని బలహీనతలను సి.సి. లోతుగా చర్చించి ఆయనపై క్రమశిక్షణా చర్య తీసుకుంది. ఆయన్ని సిసి నుంచి రెండు సంవత్సరాల కాలం సస్పెండ్ చేసి, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉండి పనిచేయాలని నిర్ణయించింది. మా పార్టీ నిబంధనావళిలో సస్పెన్షన్ కాల పరిమితి సంవత్సర కాలానికి మించకూడదని స్పష్టంగా రాసుకున్నప్పటికీ, సరసింహా రెడ్డిలోని బలహీనతల తీవ్రతను గంభీరంగా పరిగణనలోకి తీసుకున్న సి.సి. ఆయన సస్పెన్షన్ కాలాన్ని రెండేళ్లుగా నిర్ణయించింది. నరసింహా రెడ్డి సీనియారిటీని దృష్టిలో ఉంచుకొని, వర్గ పోరాటంతో, విప్లవోద్యమంతో ఆయన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్న సిసి తన తప్పులను సీరియస్‌గా తీసుకొని సరిదిద్దుకుంటాడని భావించింది. అయితే సిసి తీసుకున్న క్రమశిక్షణా చర్యను ఆయన జీర్ణించుకోలేకపోయాడు.

ఆయన పార్టీ పంథాపై, డాక్యుమెంట్లపై తనకు ఎటువంటి భిన్నాభిప్రాయాలు లేవనీ చివరి వరకూ చెబుతూ వచ్చాడు. సిసి 5వ సమావేశంలోనే పార్టీలో ఎవరికైనా భిన్నాభిప్రాయాలు ఉంటే పరిష్కరించుకునేందుకు అనుసరించాల్సిన పద్ధతి గురించి లోతైన తీర్మానం కూడా సిసి చేసింది. ఈ తీర్మానం వెలుగులోనైనా తనకు ఏ విషయంలో అయినా భిన్నాభిప్రాయాలు ఉన్నట్లు ఆయన నిర్దిష్టంగా పేర్కొనలేదు.

ప్రెస్ మీట్‌లో నరసింహా రెడ్డి ఈ వాస్తవాలను కప్పిపుచ్చుతూ, రాజకీయంగా దిగజారి అంతిమంగా విప్లవానికి ద్రోహం చేస్తూ శత్రువు ముందు మోకరిల్లాడు.

నరసింహా రెడ్డి దిగజారుడుకు, ద్రోహానికి ప్రధాన కారణాలు ఏమిటి?

మొదటిది, ఆయన మూడు దశాబ్దాల కంటే ఎక్కువ కాలం నుండి విప్లవోద్యమంలో వివిధ స్థాయిల్లో పనిచేసినప్పటికీ, తనలో తీవ్రస్థాయిలో వ్యక్తివాదం పెరిగిన మూలంగా ఆయన తాను ఉన్న కమిటీలో భాగమై టీం స్పిరిట్‌తో పనిచేయకపోవడంతో ఒక కార్మికవర్గ విప్లవకారునిగా తనను తాను తీర్చిదిద్దుకోలేక పోయాడు.

రెండవది, సైద్ధాంతికంగా, రాజకీయంగా, మిలటరీపరంగా ఆయనలో ఎదుగుదల ఆగిపోయింది. ఫలితంగా ఉద్యమానికీ, పార్టీకీ నిర్మాణపరంగా నేతృత్వం వహించగలిగే సామర్థ్యాన్ని క్రమక్రమంగా కోల్పోయాడు.

మూడవది, పెటీబూర్జువా అరాచకవాదం, పెత్తందారీతనం, నిర్మాణ రాహిత్యం ఆయనలో బలంగానే ఉండిపోయాయి. తన తప్పుల, బలహీనతల గురించి తనకు బాగానే తెలిసినప్పటికీ వాటిని సరిదిద్దుకునేందుకు ఎటువంటి ప్రయత్నాలు ఆయన చేయలేదు. ఆయనలోని పెటీబూర్జువా కుహనా ప్రతిష్ట ఆయన నిజాయితీగా ఆత్మవిమర్శ చేసుకునేందుకు అడ్డంకిగా మారింది. ఫలితంగా ఆయనలో విప్లవ చేవ పూర్తిగా నశించింది.


నాలుగవది, ఇటీవలి కాలంలో విప్లవోద్యమం ఎదుర్కొంటున్న గడ్డు స్థితిలో తీవ్ర నష్టాలను, శత్రు దాడి తీవ్రతను చూసి ఆయనలో భయం తీవ్ర స్థాయికి చేరింది. ప్రస్తుత అననుకూల పరిస్థితిని, శత్రు దాడిని ఎదుర్కొంటూ ఉద్యమానికి నాయకత్వం వహించగలననే విశ్వాసం ఆయన కోల్పోయాడు. ఉద్యమం, పార్టీ, ప్రజల ప్రయోజనాలను తన ప్రయోజనాలుగా ఎంచి త్యాగనిరతితో పని చేసే చైతన్యాన్ని కోల్పోయాడు.

ఇప్పటి వరకూ ద్వితీయ అంశంగా ఉంటూ వచ్చిన నరసింహా రెడ్డి విప్లవ జీవితంలోని తప్పులు, బలహీనతలు ప్రధాన అంశంగా మారిపోయాయి. ఒక విప్లవకారుడిగా, విప్లవ నాయకుడిగా ఉన్న ఆయన విప్లవ వ్యతిరేకిగా, విప్లవ ప్రతీఘాతకుడిగా మారిపోయాడు. విప్లవకారులు ఎవరైనా, గతంలో ఆయనకు/ఆమెకు ఎంత ఆదర్శవంతమైన చరిత్ర ఉన్నా తమలోని కార్మికవర్గేతర భావాలపై, తప్పులపై తాము అంతర్గత పోరాటం చేయకుండా ఎక్కువ కాలం కొనసాగలేరు. ఇది విప్లవ గతితర్కం. ఇది సమాజానికీ, వ్యక్తులకూ, విప్లవకారులకు సైతం వర్తించే నియమం. స్వార్థపరులు, పార్టీ, విప్లవం, పీడిత ప్రజల కంటే తమకు తాము అధికులమని భావించే కెరీరిస్టు నాయకులు చరిత్ర పెంటకుప్పపైకి విసిరివేయబడతారు. అదే విధంగా నరసింహా రెడ్డి సైతం చరిత్ర పుటల్లో విద్రోహులలో ఒకడిగా మా పార్టీ చరిత్రలో నిలిచిపోతాడు.

నరసింహా రెడ్డి మా పార్టీకీ, కేడర్లకు, విప్లవ ప్రజలకు ఒక నెగెటివ్ టీచర్‌గా నిలిచిపోతాడు. విప్లవకారులలో అంతర్గత పోరాటం శత్రువుతో సాగించే వర్గ పోరాటం కంటే చాలా క్రూరంగా, కఠినంగా, భీతిగొల్పేదిగా ఉంటుంది. ఇందుకు ఎంతో గొప్ప ధైర్యం, దృఢనిశ్చయం ఉండాలి. అన్నింటికంటే మార్క్సిజం-లెనినిజం-మావోయిజం (ఎంఎల్ఎం) సిద్ధాంతం పట్ల, పీడిత ప్రజల పట్ల, పార్టీ పట్ల లోతైన అంకిత భావం ఉండాలి.

**ప్రియమైన ప్రజలారా!**

పార్టీ, విప్లవం, ప్రజల ప్రయోజనాలకు దూరమై, తమ స్వార్థ ప్రయోజనాలకు విలువ నిచ్చి ద్రోహం చేసే రెనగేడ్లను తీవ్రంగా వ్యతిరేకిద్దాం, వారిని అసహ్యించుకుందాం. విప్లవ ద్రోహులను కఠినంగా శిక్షిద్దాం. మన ప్రియతమ అమరులు చూపిన అరుణకాంతులీనే విప్లవ బాటలో కమ్యూనిస్టు విలువల్ని, ఆచరణను చివరి ఊపిరి వరకూ ఎత్తిపడుతూ దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో, సోషలిజం-కమ్యూనిజం సాధించే లక్ష్యంతో భారత నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పురోగమింపజేద్దాం.



**అభయ్**

**అధికార ప్రతినిధి**

**కేంద్ర కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**